బతికుండగానే మహిళలను పూడ్చే యత్నం

మధ్యప్రదేశ్‌లో వెలుగుచూసిన దారుణం

భోపాల్, జూలై 21: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. తాము లీజుకు తీసుకున్న భూమిలో రోడ్డు నిర్మాణ ప్రాజెక్టును అడ్డుకునేందుకు యత్నించిన ఇద్దరు మహిళలపై కొందరు డంపర్ ట్రక్కు ద్వారా మట్టి పోసి వారిని సజీవ సమాధి చేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు వెంటనే వారిని బయటకు తీయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. రేవా జిల్లాలోని హినోతా జోరత్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమ భూమి నుంచి రోడ్డు వేయడానికి వీలులేదని మమత పాండే, ఆశా పాండే అనే మహిళలతో పాటు మరికొందరు గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. అయితే వారి నిరసనలు పట్టించుకోకుండా ట్రక్కు ద్వారా మట్టిని పొలంలో వేసేందుకు రాగా, వారు తమ పొలంలోనే బైఠాయించారు. అయితే అవేమీ పట్టించుకోకుండా స్థానికంగా ఉండే కొందరి పెద్దల ప్రోత్సాహంతో ట్రక్కు వెనుక ఉన్న వారిపై డైవర్ మట్టిని అన్‌లోడ్ చేయడంతో వారు అందులో పీకల్లోతు కూరుకుపోయారు. చుట్టుపక్కల వారు కేకలు పెడుతూ వచ్చి వారిని రక్షించారు.

వైరల్ ఇన్‌ఫెక్షన్స్‌కు లైఫ్‌టైమ్ వ్యాక్సిన్!

భవిష్యత్తులో వచ్చే వాటిపైనా పనిచేసే టీకాలు

వాషింగ్టన్, జూలై 21: మానవాళిని ఇప్పుడు వేధిస్తున్న పలు వైరస్‌లతోపాటు, భవిష్యత్తులో తలెత్తే మహమ్మారిలను ఎదుర్కొనేందుకు 'ఆల్ ఇన్ వన్'.. అనదగ్గ వ్యాక్సిన్ తయారీపై సైంటిస్టుల పరిశోధనలు కీలక దశకు చేరుకున్నాయి. సింగిల్ షాట్.. లైఫ్ టైమ్ వ్యాక్సిన్‌గా పేర్కొంటున్న ఈ టీకాను అభివృద్ధి చేయటంలో 'ఒరేగావ్ హెల్త్, సైన్స్ యూనివర్సిటీ' పరిశోధకులు ముందడుగు వేశారు. ఒకసారి టీకాను తీసుకోవటం ద్వారా జీవితకాలం 'ఇన్‌ఫ్లూయెంజా వైరస్'ల నుంచి రక్షణ లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. మరికొద్ది సంవత్సరాల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని సమాచారం. ఈ వైరస్‌పై తయారుచేసిన వ్యాక్సిన్, బర్డ్ ఫ్లూ వైరస్‌ను కూడా సమర్థవంతంగా అడ్డుకుంటున్నదని పరిశోధనలో తేలింది.

ఉజ్జయినిలోనూ దుకాణాల ముందు నేమ్‌ప్లేట్లు

నగర మేయర్ ఆదేశాలు

భోపాల్, జూలై 21: ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ తరహాలోనే మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలోనూ దుకాణాల యజమానులకు ఆ నగర మున్సిపల్ కార్పొరేషన్ కీలక ఆదేశాలు జారీచేసింది. దుకాణం యజమాని పేరు, అతడి మొబైల్ నెంబర్‌తో దుకాణం బయట 'నేమ్ ప్లేట్స్' ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ మార్గదర్శకాలు వెలువడ్డాయి. నిబంధనల్ని మొదటిసారి ఉల్లంఘించినట్టు తేలితే, రూ.2వేలు, రెండోసారి ఉల్లంఘించినట్టు రుజువైతే రూ.5వేలు జరిమానా విధిస్తామని ఉజ్జయిని మేయర్ ముకేశ్ తత్వాల్ హెచ్చరించారు. ఉజ్జయిని నగరానికి వచ్చే పర్యాటకుల భద్రత, పారదర్శకత కోసం తప్ప, ముస్లిం దుకాణాదారులను టార్గెట్ చేయడానికి కాదని మేయర్ వివరించారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్వస్థలం ఉజ్జయిని. ఇక్కడి మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించేందుకు భక్తులు దేశవిదేశాల నుంచి వస్తుంటారు. సోమవారం నుంచి శ్రావణ మాసం ఆరంభం కావటంతో, ఉజ్జయినికి భక్తుల తాకిడి భారీగా ఉంటుంది.

వారణాసిలో మాంసం, పౌల్ట్రీ దుకాణాల మూసివేతకు ఆదేశం

వారణాసి : శ్రావణ మాసంలో కన్వర్ యాత్ర జరిగే మార్గంలోని మాంసం, పౌల్ట్రీ దుకాణాలను మూసివేయాలని వారణాసి నగర పాలక సంస్థ ఆదేశించింది. ఈ మార్గంలోని ఇటువంటి దుకాణాల మూసివేతకు సర్వే నిర్వహించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కన్వర్ యాత్ర జరిగే ప్రాంతాల్లోని హోటళ్లు, దాబాలు, తినుబండారాలను విక్రయించే బండ్ల వద్ద వాటి యజమానుల పేర్లను స్పష్టంగా కనిపించేలా రాయాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ యాత్ర నేటి నుంచి ప్రారంభమవుతుంది.

బైడెన్

అమెరికా అధ్యక్ష రేసు నుంచి తప్పుకుంటున్నట్టు జో ప్రకటన

- డెమొక్రటిక్ పార్టీ, దేశ ప్రయోజనాల కోసమేనని వెల్లడి
- పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరగడంతో నిర్ణయం
- పూర్తి కాలం అధ్యక్షుడిగా కొనసాగుతానని స్పష్టీకరణ
- పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్ పేరు ప్రతిపాదన
- అధ్యక్ష ఎన్నికల వేళ అనూహ్య పరిణామం

వాషింగ్టన్, జూలై 21: అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికా రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకొన్నది. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి ప్రస్తుత అధ్యక్షుడు, డెమొక్రటిక్ పార్టీ నేత జో బైడెన్ తప్పుకొన్నారు. ఈ మేరకు బైడెన్ స్వయంగా ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ప్రకటన చేశారు. దేశంతోపాటు డెమొక్రటిక్ పార్టీ ప్రయోజనాల కోసం అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించిన 81 ఏండ్ల బైడెన్.. దేశాధ్యక్షుడిగా 2025, జనవరి వరకు ఉన్న తన పూర్తి పదవీ కాలం కొనసాగుతానని స్పష్టం చేశారు. గత నెల ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో తడబాటు, ఇతరత్రా అంశాల నేపథ్యంలో అధ్యక్ష పోటీ నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరగడంతో బైడెన్ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తున్నది. దేశానికి అధ్యక్షుడిగా సేవలు అందించడం తన జీవితంలో గొప్ప గౌరవమని బైడెన్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'తిరిగి ఎన్నిక కావాలనేది నా ఉద్దేశం. అయితే దేశం, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నా. మిగతా పదవీ కాలం అధ్యక్షుడిగా నా బాధ్యతలు నిర్వర్తించడంపై దృష్టి పెడుతా' అని అన్నారు.

కమలా హారిస్‌కు లైన్ క్లియర్

ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్న క్రమంలో డెమొక్రటిక్ పార్టీ తరపున అభ్యర్థిగా ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా ఉన్న కమలా హారిస్ పేరును బైడెన్ ప్రతిపాదించారు. 2020లో ఉపాధ్యక్ష నామినీగా కమలా హారిస్‌ను ఎంపిక చేస్తూ అప్పట్లో నిర్ణయం తీసుకొన్నానని, అది తాను తీసుకొన్న బెస్ట్ నిర్ణయమని బైడెన్ పేర్కొన్నారు. ఆమె ఒక అద్భుతమైన భాగస్వామి అని కొనియాడారు. 'ఈ ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ఈ రోజున కూడా నా పూర్తి మద్దతు, ఆమోదం కమలా హారిస్‌కు ఇస్తున్నాను' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. పార్టీ నేతలు, అందరూ కలిసికట్టుగా పోరాటం చేసి, ట్రంప్‌ను ఓడించాలని ఈ సందర్భంగా ఆయన డెమొక్రాట్లకు పిలుపునిచ్చారు. అధ్యక్ష బరి నుంచి తప్పుకోవడంపై తాను జాతినుద్దేశించి తర్వాత ప్రసంగిస్తానని బైడెన్ పేర్కొన్నారు.

తప్పుకోవాలని పెద్దయెత్తున డిమాండ్లు

అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నుంచే పెద్దయెత్తున డిమాండ్ వస్తున్న నేపథ్యంలో బైడెన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. రిపబ్లికన్ పార్టీ నేత, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లలో తడబాటు, పలు సందర్భాల్లో వింత ప్రవర్తన, ట్రంప్‌నకు పోటీ ఇవ్వలేరన్న అంచనాల నేపథ్యంలో బైడెన్ అధ్యక్ష పోటీ నుంచి తప్పుకోవాలని డెమొక్రటిక్ పార్టీ నేతల నుంచి ఒత్తిడి, డిమాండ్లు పెరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల బరిలో నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించే కంటే ముందు బైడెన్ ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని ముగించారు.

చర్చనీయాంశంగా బైడెన్ తడబాటు

బైడెన్ ప్రవర్తనా శైలి, పలు సందర్భాల్లో మాటల తడబాటు ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల నాటో కూటమి సమావేశంలో ఆయన తన పక్కనే ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'ప్రెసిడెంట్ పుతిన్'గా సంబోధించారు. అయితే వెంటనే తన తప్పు తెలుసుకొని దాన్ని సరిదిద్దుకోవడానికి జెలెన్‌స్కీ ప్రెసిడెంట్ పుతిన్‌ను ఓడించబోతున్నారని తెలిపారు. ఈ సమావేశం తర్వాత జరిగిన మీడియా సమావేశంలో బైడెన్ మళ్లీ తడబడ్డారు. 'ఆమెకు అధ్యక్షురాలయ్యే అర్హత లేదని నేను అనుకొని ఉంటే ట్రంప్‌ను ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసి ఉండను' అని అన్నారు. బైడెన్ మాటలకు తెల్లబోవడం అక్కడున్న డెమొక్రటిక్ పార్టీ అగ్రనేతలు వంతయింది. అధ్యక్ష అభ్యర్థిగా ఓ వైపు తనకు వ్యతిరేకంగా గళాలు పెరుగుతున్నప్పటికీ, అధ్యక్ష పోటీ నుంచి తప్పుకొనేలా లేదని బైడెన్ ఇంత వరకూ చెప్పుకొచ్చారు. తనపై వ్యతిరేక ప్రచారానికి ముగింపు పలకాలని ఆయన పార్టీ వర్గాలను కోరారు. ఈ మేరకు ఆయన పార్టీ సహచరులకు రెండు పేజీల లేఖ కూడా రాశారు.

ట్రంప్‌తో డిబేట్ నుంచి మొదలు..

అమెరికా అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో గత నెల 27న జరిగిన ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ వెనుకబడిన నాటి నుంచి ఆయనపై పార్టీలో వ్యతిరేకత పెరిగింది. బైడెన్ మానసికంగా ధృడంగా లేరని, ట్రంప్‌నకు ఆయన సరైన పోటీ ఇవ్వలేరన్న వాదనలతో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని డిమాండ్లు పార్టీలో వచ్చాయి. అట్లాంటాలోని సీఎన్‌ఎన్ హెడ్‌క్వార్టర్స్‌లో దాదాపు 90 నిమిషాలపాటు జరిగిన డిబేట్‌లో ట్రంప్‌దే పైచేయిగా కనిపించింది. బైడెన్ తడబడుతూ మాట్లాడటంతో ఆయన పార్టీ ఆందోళనకు గురైంది. ఈ డిబేట్‌లో ట్రంప్ ఘాటుగా, సూటిగా మాట్లాడేసరికి, బైడెన్ నోటి నుంచి మాటలు నెమ్మదిగా, నీరసంగా వచ్చాయి. అమెరికన్ ఆర్థిక వ్యవస్థ, విదేశాలతో సంబంధాలు, వలసల గురించి బైడెన్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. దీనిపై బైడెన్ స్పందిస్తూ, ట్రంప్ వ్యాఖ్యలు అతిశయోక్తులు, అబద్ధాలని చెప్పారు.

1987లోనే అధ్యక్ష పదవికి పోటీ

జో బైడెన్ 1942లో పెన్సిల్వేనియాలో జన్మించారు. డెలావేర్ విశ్వవిద్యాలయం, సిరాక్యూస్ లా స్కూల్‌లో చదువుకున్నారు. మొదట పబ్లిక్ డిఫెండర్‌గా పని చేసి, ఆ తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1972లో 29 ఏళ్ల వయసులో అమెరికా సెనేట్‌కు పోటీ చేశారు. ఆయన కన్నా రెట్టింపు వయసుగల రిపబ్లికన్ అభ్యర్థి జే సెలెబ్ బాగ్స్ చేతిలో పరాజయం చవిచూశారు. అదే సంవత్సరం రిచర్డ్ నిక్సన్ అమెరికా అధ్యక్షునిగా విజయం సాధించారు. ఆయన 37వ ప్రెసిడెంట్ కాగా, 2021లో జో బైడెన్ 46వ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఈ 49 ఏళ్ల కాలంలో 8 మంది దేశాధ్యక్ష పదవిని నిర్వహించారు. ఈ సమయంలో బైడెన్ 36 ఏళ్లపాటు సెనేటర్‌గానూ, ఎనిమిదేళ్ల పాటు అమెరికా ఉపాధ్యక్షునిగానూ పని చేశారు. 1987లో మొదటిసారి అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసి, ఓడిపోయారు. 1972లో క్రిస్టమస్ సమయంలో జరిగిన కారు ప్రమాదంలో జో బైడెన్ సతీమణి నెయిలియా బైడెన్, కుమార్తె నవోమీ (1) ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం నుంచి ఆయన కుమారులు బ్యూ, హంటర్ బయటపడ్డారు. 1977లో ఆయన జిల్ జాకోబ్స్‌ను రెండో పెళ్లి చేసుకున్నారు. నాలుగేళ్ల తర్వాత కుమార్తె ఆష్లే జన్మించారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ పాలనపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబికిన సమయంలో జో బైడెన్‌కు నల్ల జాతీయులు గట్టి మద్దతుగా నిలిచారు. అదే సమయంలో కొవిడ్-19 మహమ్మారి రావడంతో ప్రచారం కోసం పరిమితంగానే ప్రయాణాలు చేశారు. అనంతరం 70 లక్షల ఓట్ల ఆధిక్యంతో ట్రంప్‌పై విజయం సాధించారు. అమెరికా అధ్యక్షుడైన అత్యంత వృద్ధ నేతగా నిలిచారు.

దేశ చరిత్రలోనే చెత్త అధ్యక్షుడు: ట్రంప్

అధ్యక్ష రేసు నుంచి తప్పుకుంటున్నటు బైడెన్ ప్రకటించడంపై మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. 'అతను దేశ చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు. మన దేశంలో ఆయనో చెత్త అధ్యక్షుడిగా నిలిచిపోతారు. డెమొక్రటిక్ పార్టీ నుంచి ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ బరిలో దిగితే బైడెన్ కంటే సులువుగా ఓడించవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు.

నెట్ రీ-ఎగ్జామ్‌పై స్టే విధించండి

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 21: యూజీసీ-నెట్ పరీక్ష రద్దు చేయాలన్న కేంద్ర విద్యాశాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ప్రశ్నపత్రం లీకేజీపై సీబీఐ విచారణ పూర్తయ్యేవరకు పరీక్ష మళ్లీ నిర్వహించడంపై స్టే విధించాలని పిటిషనర్ అయిన న్యాయవాది ఉజ్వల్ గౌర్ కోర్టును కోరారు. పరీక్షను రద్దు చేయడం వల్ల అభ్యర్థులు ఒత్తిడి, ఆందోళనకు గురవుతారని.. మళ్లీ పరీక్షకు ప్రిపేర్ కావడానికి వారి వద్ద ఉన్న వనరులు అనవసరంగా ఖర్చవుతాయని వాదించారు. ఈ పిటిషన్ త్వరలోనే విచారణకు రానుంది.

నీట్ యూజీలో 11 వేల మందికి సున్నా మార్కులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది నిర్వహించిన నీట్-యూజీలో 11,000 మందికి పైగా అభ్యర్థులకు సున్నా, మైనస్ మార్కులు వచ్చాయి. ఈ ఫలితాలను పరీక్షా కేంద్రాల వారీగా ఎన్‌టీఏ శనివారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. బీహార్‌లో ఓ విద్యార్థికి మైనస్ 180 మార్కులు వచ్చాయి. ఈ ఏడాది అతి తక్కువ స్కోర్ ఇదే. 2,250 మందికి సున్నా మార్కులు, 9,400 మందికి సున్నా కన్నా తక్కువ మార్కులు వచ్చాయి.

బీజేపీకి యూపీ బుగులు

- రాష్ట్రంపై సడలుతున్న పార్టీ పట్టు
- సీఎం యోగి, డిప్యూటీ సీఎం మౌర్య మధ్య విభేదాలతో పార్టీకి తలనొప్పి
- 27న ప్రధానితో యోగి సమావేశం
- అమిత్‌షా, నడ్డాతోనూ భేటీ
- విభేదాలు చల్లార్చేందుకు రంగంలోకి ఆరెస్సెస్

న్యూఢిల్లీ/లక్నో, జూలై 21: లోక్‌సభ ఎన్నికల ఫలితాల షాక్‌తో ఉత్తరప్రదేశ్ బీజేపీలో బయటపడ్డ నేతల మధ్య అంతర్గత విభేదాలు ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య మధ్య వైరం రచ్చకెక్కింది. గత ఆదివారం జరిగిన రాష్ట్ర పార్టీ సమావేశంలో యోగి మాట్లాడుతూ అతి విశ్వాసం వల్లే రాష్ట్రంలో తక్కువ ఎంపీలు సీట్లు వచ్చాయని పేర్కొనగా.. అదే సమావేశంలో పాల్గొన్న మౌర్య మాట్లాడుతూ 'పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదు. ప్రభుత్వం కూడా పార్టీ కంటే ఎక్కువ కాదు' అని యోగిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పార్టీలో నెలకొన్న విభేదాలు బయటపడ్డాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు బీజేపీ అగ్రనాయకత్వం రంగంలోకి దిగినట్టుగా తెలుస్తున్నది. ఇందులో భాగంగా ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీలో సమావేశమవుతారని పార్టీ, ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. నీతిఆయోగ్ కౌన్సిల్ సమావేశానికి పాల్గొనే నిమిత్తం ఢిల్లీ వెళ్లనున్న సీఎం యోగి.. అక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా కలుస్తారని తెలిపాయి. యూపీ బీజేపీలో విభేదాల నేపథ్యంలో ఈ భేటీలకు ప్రాధాన్యం సంతరించుకొన్నది. లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ సీట్లు 2019లో వచ్చిన 62 సీట్ల నుంచి 33కు పడిపోయిన విషయం తెలిసిందే. రాష్ట్రంపై బీజేపీ పట్టు క్రమంగా సడలుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మోదీకి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి నివేదిక

యూపీ బీజేపీలో అగ్రనేతల మధ్య విభేదాలు ముదిరిన వేళ.. రాష్ట్ర పార్టీ సమావేశం జరిగిన ఈనెల 14కు మూడు రోజుల తర్వాత డిప్యూటీ సీఎం మౌర్య, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి ఢిల్లీలో నడ్డాతో సమావేశమయ్యారు. భూపేంద్ర చౌదరి ప్రధాని మోదీని కూడా కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో పలువురు నేతలు క్రియాశీలంగా పనిచేయలేదని, కొన్ని జిల్లాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేదని ఆయన ప్రధానికి ఒక నివేదిక సమర్పించినట్టు తెలిసింది. మరోవైపు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులతో సమావేశమైన సీఎం యోగి ఆదిత్యనాథ్.. త్వరలో రాష్ట్రంలో జరిగే 10 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికలకు సిద్ధమవ్వాలని సూచించారు.

రాష్ట్ర నేతలతో ఆరెస్సెస్ సంప్రదింపులు

యూపీ బీజేపీలో నెలకొన్న విభేదాల మంటలను చల్లార్లేందుకు ఆ పార్టీ సైద్ధాంతిక మాతృ సంస్థగా భావించే ఆరెస్సెస్ రంగంలోకి దిగింది. విభేదాలను పరిష్కరించేందుకు అగ్ర నేతలను రంగంలోకి దించినట్టు తెలుస్తున్నది. సీనియర్ వీహెచ్‌పీ ఆఫీస్ బేరర్ రాజీవ్ శ్రీవాస్తవ రాష్ట్ర బీజేపీ, ప్రభుత్వంలోని పలువురు పెద్దలతో సమావేశమైనట్టు సమాచారం. విభేదాలను పరిష్కరించుకోవాలని వారు సూచించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. తూర్పు యూపీకి చెందిన ఓ సీనియర్ ప్రచారక్ కూడా కేశవ్ ప్రసాద్ మౌర్యతో ఆయన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. ఆయన ఇతర నేతలతో కూడా మాట్లాడినట్టు తెలిసింది.

కేదార్‌నాథ్ యాత్రలో విషాదం

- విరిగిపడ్డ కొండచరియలు
- ముగ్గురి దుర్మరణం.. 8 మందికి గాయాలు

రుద్రప్రయాగ్, జూలై 21: కేదార్‌నాథ్ యాత్రికులపై కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో ముగ్గురు భక్తులు మృతి చెందగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో ఆదివారం నడకమార్గాన భక్తులు వెళ్తుండగా గౌరీకుండ్-కేదార్‌నాథ్ మార్గంలో చిర్‌బాసా ప్రాంతంలో వీరిపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా 8 మంది గాయపడ్డారు.

మహారాష్ట్రలో ఆగని రైతు ఆత్మహత్యలు

6 నెలల్లో 1,267 మంది బలవన్మరణం

ముంబై, జూలై 21: బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి పాలనతో మహారాష్ట్రలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో 1,267 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విదర్భ ప్రాంతంలోని అమరావతి డివిజన్‌లో అత్యధికంగా 557 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రైతు ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్‌లో 430 మంది, నాసిక్ డివిజన్‌లో 137 మంది, నాగపూర్ డివిజన్‌లో 130, పుణె డివిజన్‌లో 13 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదిక ప్రకారం, 2022 ఏడాదికి సంబంధించి దేశంలోనే అత్యధికంగా రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలోనే (37.6శాతం) చోటుచేసుకున్నాయి. 2022లో దేశవ్యాప్తంగా మొత్తం 11,290 మంది రైతులు బలన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో 5,207 మంది రైతులు, 6,083 మంది రైతు కూలీలు ఉన్నారు.

ఎన్డీయే సర్కారు ఎక్కువకాలం సాగదు

బెంగాల్ ర్యాలీలో మమత, అఖిలేశ్

కోల్‌కతా, జూలై 21: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలో ఉండలేదని బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతాబెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. మతశక్తులకు తాత్కాలిక విజయం లభించినా అంతిమంగా అవి ఓటమి పాలవ్వక తప్పదని అఖిలేశ్ అన్నారు. బెంగాల్‌లో ఆదివారం మమత నేతృత్వంలో జరిగిన అమర వీరుల దినోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సర్కారు ఎంతోకాలం అధికారంలో కొనసాగలేదని, త్వరలోనే ఆ ప్రభుత్వం పడిపోతుందని అన్నారు. ఎలాగైనా అధికారంలోనే ఉండాలని అలాంటి మతశక్తులు భావిస్తాయని, కాని వారు అందులో వారు విజయం సాధించలేరని అన్నారు. బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎలా దుర్వినియోగం చేసి అధికారంలోకి వచ్చిందో అందరికీ తెలుసని, అయితే ఎన్డీఏ ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉండలేదని మమతా బెనర్జీ అన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీని మట్టి కరిపించిన అఖిలేశ్ యాదవ్‌ను ఆమె ప్రశంసించారు.

కేరళలో నిఫా కలకలం

వైరస్ సోకిన బాలుడి మృతి • రిస్క్‌లో మరో 60 మంది

తిరువనంతపురం: కరోనా వైరస్ కన్నా చాలా ప్రమాదకరమైందిగా భావిస్తున్న 'నిఫా వైరస్' కేరళలో పంజా విసురుతున్నది. వైరస్ బారినపడి వెంటిలేటర్‌పై ఉన్న 14 ఏండ్ల బాలుడు కోజికోడ్‌లో గుండె పోటుతో మరణించాడని కేరళ ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ ఆదివారం ప్రకటించారు. ప్రభుత్వ అధికారులు మలప్పురం జిల్లా అంతటా హై-అలర్ట్ ప్రకటించారు. బాలుడితో కాంటాక్ట్ అయిన 240 మందిని క్వారంటైన్‌లో ఉంచినట్టు తెలిసింది. వైరస్ వ్యాప్తి ప్రభావిత గ్రామాల్లో లాక్‌డౌన్ విధించారు. ప్రజలంతా తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని మంత్రి సూచించారు. బాలుడితో కాంటాక్ట్ ఉన్న వారిలో 60 మందిని హై-రిస్క్ క్యాటగిరీగా గుర్తించిన జిల్లా అధికారులు తగిన చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

లక్షణాలు

- వైరస్ సోకిన వాళ్లలో తొలుత జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాల నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- సరైన చికిత్స అందకపోతే, శ్వాస సంబంధిత సమస్యలు, నిమోనియా ఏర్పడతాయి. రోగి మెదడు దెబ్బ తిని కోమాలోకి వెళ్లిపోతాడు.



ఏమిటీ వైరస్?

- ఈ వైరస్‌ను తొలిసారి 1999లో గుర్తించారు. ఇది 'ఫ్రూట్ బ్యాట్' అనే గబ్బిలాల్లో ఉంటుంది. వాటి నుంచి ఇతర జంతువులకు, మనుషులకు సోకుతుంది.
- వైరస్ ఉన్న గబ్బిలాలతో మనుషులు కాంటాక్ట్ అయినా, వాటి లాలాజలం లేదా అవి వాలిన ఆహార పదార్థాల (పండ్లు) ద్వారా వైరస్ వ్యాప్తి చెందుతుంది.
- ఒకసారి మనుషులకు సోకితే.. వారి నుంచి ఇతరులకు వ్యాపిస్తుంది.

చికిత్స

నిఫా వైరస్‌ను ఎదుర్కొనే యాంటీ వైరల్ వైద్య చికిత్స ఏదీ ఇప్పటివరకూ లేదు. వైరస్ సోకిన రోగిని ఐసోలేషన్‌లో ఉంచుతూ, రోగ లక్షణాలను అనుసరించి వైద్య చికిత్స అందిస్తుంటారు.

గుజరాత్‌లో 'చాందీపురా' కలవరం

వైరస్‌తో 32 మంది మృతి.. • 84కి చేరిన కేసులు

గాంధీనగర్, జూలై 21: ఉత్తరాదిన పలు రాష్ట్రాల్లో 'చాందీపురా' వైరస్ తీవ్ర కలకలం రేపుతున్నది. ఒక్క గుజరాత్‌లో ఈ వైరస్ బారినపడి 32మంది చనిపోయారని గుజరాత్ ఆరోగ్యమంత్రి రుషికేష్ పటేల్ ఆదివారం ప్రకటించారు. వైరస్ కేసులు 84కి చేరినట్టు చెప్పారు. సబరకాంత జిల్లాలో 14 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చిన ముగ్గురు వైరస్ బారినపడ్డారని, ఇతర రాష్ట్రాల్లోనూ వైరస్ వ్యాప్తి చెందిందని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది తగిన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వైరస్ సంబంధించిన కేసులు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



ఏమిటీ వైరస్?

- 1965లో మహారాష్ట్రలోని చాందీపురాలో తొలిసారి ఈ వైరస్ వెలుగులోకి వచ్చింది. 15 ఏండ్లలోపు ఓ పిల్లాడు ఈ వైరస్‌తో చనిపోయాడు. దీంతో ఈ వైరస్‌కు 'చాందీపురా' అనే పేరు వచ్చింది.
- ఈగలు, కీటకాలు, దోమల నుంచి వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా ఈడిస్ రకం దోమల నుంచి వ్యాప్తి చెందుతున్నదని వైద్య నిపుణులు గుర్తించారు.
- ఈ ఏడాది జూన్ నుంచి గుజరాత్‌లో 15 లోపు పిల్లల్లో 'అక్యూట్ ఎన్సెఫాలిటిస్ సిండ్రోమ్' కేసులు నమోదయ్యాయి.

చికిత్స